# సుడిగాలి

అప్పుడే ఆఫీసులోనుంచి బయటికి వచ్చి, రిక్షాకోసం నాలుగువైపులకీ దృష్టి సారిస్తున్న భారతి ప్రక్కగా గచ్చకాయ రంగు ఫియట్ కారు ఆగింది.

"హాయ్! భారతీ!" స్టీరింగు ముందున్న యువతి కళ్ళకి పెట్టుకున్న నల్ల అద్దాలు తీసి, "నేనోయ్ హేమని!" అన్నది.

"ఏ హేమో! ఏం కథో!" అని విసుగ్గా మొహం పెట్టింది భారతి—

"నన్ను గుర్తు పట్టలేదన్నమాట- కె. హేమలతాదేవి నా పేరు - మనిద్దరం హైస్కూల్లో కలిసి చదువుకున్నాం."

"ఓ! హేమా!" భారతి ముఖం వికసించింది.

డోర్ తెరచి పట్టుకుని "గెటిన్" అంది హేమ—

"ఇక్కడుంటున్నావా?" భారతి అడిగింది.

"బావుంది - ఆ ప్రశ్న నేనే నిన్ను అడగాలి - పెళ్ళి చేసుకున్నావా? పిల్లలెంతమంది? ఎక్కడ మీ ఇల్లు!



మీ ఆయనేం చేస్తున్నాడు? ఏం మారలేదు నువ్వు? కళ్ళజోడు తప్పించి - ఏం! ఉద్యోగాలో ఏమో! చాలా అలసిపోయావు! కంటిచూపు దెబ్బతిన్నదా ఏం? అయినా హాయిగా ఇంట్లో కూర్చోక నీకు ఉద్యోగం ఎందుకూ?"

భారతికి మాట్లాడే అవకాశం యివ్వడంలేదు హేమ- కారు హేమ ఇంటి ముందు ఆగింది. చాలా పెద్ద ఇల్లు. చుట్టూ విశాలమైన కాంపౌండ్. రంగు రంగుల పూలు. హేమ స్టేటస్‌ని అంచనా వేసుకుంటూ కారు దిగి ఆమెని అనుసరించింది భారతి.

కారు తాళంచెవులు ఎవరికో అప్పగించి, భారతిని తన గదిలోకి తీసుకువెళ్ళింది.

"ఇందాకటినుంచీ అన్నీ నా సంగతులే అడిగావు. మరి నీ సంగతులు చెప్పూ-" అన్నది భారతి, గదిని కలయ జూస్తూ -

"ఏముంది చెప్పడానికి? చూస్తున్నావుగా? మా మావగారికి చాలా డబ్బుంది- వడ్డీ వ్యాపారంచేసి బాగా గడించారు - ఇప్పుడు నువ్వు పనిచేస్తున్నావే బ్యాంకు - ఆ భవనం మాదే- నెలకి వెయ్యి రూపాయలకి అద్దెకిచ్చాం - అంతే కాదు ఇంకా ఏమిటో చాలావున్నాయ్ - మావారేం చెయ్యరు - సరదాగా ఎం. ఏ. చదివారు-" పని మనిషి కాఫీ తెచ్చింది-

"మరి నేను వెడతాను -" అని లేచింది భారతి -

"నేను దింపుతాను పద -" హేమ మళ్ళీ తాళం చెవులు తీసుకుని కారు బయటకు తీసింది -

భారతి ఇంట్లో వరండాలో కూర్చుని తీరుబడిగా పేపరు చదువుతున్నాడు రామారావు. అతని ప్రక్కనే చిన్న కుర్చీలో పాప కూర్చుని వుంది -

"హాయ్ మమ్మీ" అంటూ లేచి వచ్చి భారతిని చుట్టుకుంది.

"శిరీష్ - ఈ ఆంటీ నా స్నేహితురాలు - హేమని కూతురికీ, భర్తకి పరిచయం చేసింది భారతి - నళిని కాఫీలు తీసుకువచ్చింది.

"మా చెల్లెలు - నా దగ్గర వుండి. బి. ఏ చదువు తోంది -" రామారావు నళినిని హేమకి పరిచయంచేశాడు - హేమ భారతి ఇల్లంతా కలయజూసింది.

"మన అంతస్తు అంచనా వేస్తున్నట్లుంది -" అన్నట్లుగా భారతివైపు చూశాడు రామారావు -

"వేసుకోనియ్ !" మనికేం అని కళ్ళతోనే జవాబు చెప్పింది భారతి.

"చిన్నప్పుడు నేనూ భారతీ చాలా స్నేహంగా వుండే వాళ్ళం - అమ్మకి చెప్పకుండా ఊరిబయట చెరువులో ఈత కూడా నేర్చుకున్నాం - మా కరణంగారమ్మాయి అదిచూసి



నవ్వి, అందరికీ చెప్పేసింది - గేదెల్ని తోలుకెళ్ళే పాలేర్ల లాగ ఆడపిల్లలు చెరువులో ఈతలాడ్డం ఏమిటని అమ్మ నా వీపు వాయగొట్టింది....." హేమ మాట్లాడుతూవుంటే విచిత్రంగా చూస్తూ, ఆసక్తిగా వింటున్నాడు రామారావు — హేమ చాలాసేపు మాట్లాడింది. అంతసేపూ రామారావుతోనే మాట్లాడింది -

"వస్తానండీ రామారావుగారూ - మా భారతీ మీరూ కలసి మా ఇంటికి రావాలి - మావారి తీరిక కనుక్కొని నేనే వచ్చి తీసుకెడతాను మిమ్మల్ని - మనం ఫామిలీ ఫ్రెండ్స్ కావాలని నా ఆశ - భారతి నేనూ విడిపోయి పదిహేనేళ్ళయింది - మళ్ళీ ఇన్నాళ్ళకి కలుసుకున్నాం ఇంక విడిపోవడం నా కిష్టంలేదు - వస్తాను - మళ్ళీ బై —"

హేమ మాట్లాడ్డం మొదలు పెడితే ఇంక ఎవర్నీ నోరు మెదపనివ్వదని గ్రహించిన భారతి చిరునవ్వు నవ్వుతూ కారు వరకూ వెళ్ళి చెయ్యి వూపి వెనక్కి తిరుగుతూ, "సుడిగాలి" అని నవ్వింది—

"చాలా చక్కని మనిషి - అమాయకురాలు కాబోలు కొంచెం ఎక్కువ మాట్లాడింది -"

రామారావు హేమని సమర్థిస్తున్నట్లు మాట్లాడడం విని కొంచెం ఆశ్చర్యపడింది భారతి -

భోజనాలదగ్గర మళ్ళీ హేమ ప్రసక్తి వచ్చింది. హేమ మామగారి ఐశ్వర్యం - హేమ అందం, అలంకారం అన్నీ కదిలాయి సంభాషణలో -

"ఆవిడలో అంత అందమేమిటో నాకు అర్థం కాద
న్నయ్యా - డబ్బుందికనుక మంచి చీరెకట్టి బాగా అలంకారం
చేసుకుంది - పైగా నువ్వు గమనించావో లేదో కానీ ఆవిడకి
కొద్దిగా మెల్లకన్నుకూడా వుంది -" అన్నది నళిని -

"మీ ఆడవాళ్ళు అంతే - పరాయివాళ్ళు బాగున్నా
రంటే వొప్పుకోరు - మీకు అసూయ -"

"పోనిద్దురూ - ఇప్పుడు ఆవిడ అందంతో మనకేం
పని ?" అని సంభాషణ తెంచేసింది భారతి—

సంవత్సరం చివరి రోజుల్లో పని ఎక్కువగా వుంటుంది.
అలసిపోయి వుండడంవలన ఆమెకి చాలా త్వరగా నిద్ర
వచ్చేసింది-

మళ్ళీ ఆదివారం ఉదయం పనిమనిషి చేత ఇల్లంతా
దులిపించి సర్దిస్తోండగా వాకిట్లో కారు ఆగింది -

"ఏమి ఆ సొగసు - చేతిలో చీపిరికట్టతో స్వాగత
మిస్తున్నావు ? ఆ జుట్టుముడేమిటి ? మీ ఆయనమీద కోపం
గాని వచ్చిందేమిటి ? అనుకుంటూ ఇంట్లోకి వచ్చింది హేమ.

ఆ సమయంలో హేమ రాక భారతికి పెద్ద సంతో
షాన్ని కలిగించలేదు-

ఆదివారం, రోజూకన్న ఎక్కువ హడావిడిగా
వుంటుంది భారతికి -

కొలీగ్ ఒకరికి బదిలీ అయింది. దంపతులిద్దర్నీ లంచ్ కి



పిలిచింది. ఎవరైనా అతిథు లొచ్చినప్పుడు ఇల్లు శుభ్రంగా
వుండకపోతే భారతికి సిగ్గనిపిస్తుంది. ఉద్యోగం చేసుకునే
వాళ్ళకి ఇంటిమీద శ్రద్ధ తక్కువ" అనుకునిపోతారేమోనని-

కర్టెన్లు ఇస్త్రీకివేసి పదిరోజులైంది. చాకలికి జ్వరంట.
ఇంతవరకూ రాలేదు. మరోజత కొందామంటే "దండగ
ఖర్చు" అనిపిస్తుంది. నళిని చదువు పూర్తి కావాలి - మరిదికి
ఉద్యోగం కావాలి - అప్పుడు ఏది కొనడానికైనా దండగ
అనిపించదు -

"ఏయ్ లక్ష్మీ త్వరగా కానియ్ - మళ్ళీ నేను వంట
చూసుకోవాలి - ఎవరో భోజనానికి వస్తున్నారు - నీ దగ్గర
నిలబడితే నాకు పనికాదు - కాస్త శ్రద్ధగా పనిచేస్తే బావుం
టుంది-" అంటూ పనిమనిషికో వార్నింగ్ యిచ్చి, హేమను
ముందుగదిలో కూర్చోపెట్టింది. అక్కడ రామారావున్నాడు.
శిరీష స్కూలుకు వేసుకుని వెళ్ళే షూస్ పాలిష్ చేస్తున్నాడు.
హేమని చూసి కంగారుపడుతూ లేచి నిలబడి నమస్కారం
చేసి, పాలిష్ చేస్తేగాని వీల్లేదని ఒకటే మంకుపట్టు" అని
సంజాయిషీ చెప్పాడు -

"నువ్వు చాలా తెలివిగలదానివి శిరీష్-" అని ఆ పిల్ల
నెత్తిమీద ఓ మొట్టికాయి వేసి కుర్చీలో కూర్చుంది హేమ.
చీర అంచులన్నీ శ్రద్ధగా పేర్చుకుని, బట్టలషాపు షోవిండోలో
బొమ్మలాగ సర్దుకుని చక్కగా కూర్చుంది -

"ఆదివారం కదా! మీ రిద్దరూ ఖాళీగా వుంటారని వచ్చాను. ఇద్దరూ చాలా బిజీగావున్నారు ?" అన్నది.

"నాకు ఆదివారమే పని ఎక్కువ హేమా ?! ఇంట్లో వున్న ముగ్గురం రోజూ బయటికి పోతాంకదా ? ఈ రోజే కొంచెం ఇల్లు బాగుచేసుకోడం - తలస్నానాలు - బట్టలు వుతికించుకోవడం - అన్నీ - నీకు కంపెనీ ఇవ్వలేక పోతున్నందుకు సారీ - ఏమనుకోకు - త్వరగా స్నానంచేసి వస్తాను - ఆయనతో మాట్లాడుతూవుండు -" అని చెప్పేసి భారతి లోపలికి వెళ్ళిపోయింది.

పాలిష్ చేసిన జోళ్లు తీసుకుని పాప వెళ్లింది.

నళిని కాఫీ కప్పులు తెచ్చి ఇద్దరికీ ఇచ్చి మోడామీద కూర్చుంది -

"యేమోయ్ నళినీ - ఎలావుంది మీ కాలేజీలైఫ్! వుమన్స కాలేజీలో చేరావేమిటి? వుమన్స కాలేజీ జీవితంలో ఏమి థ్రిల్ వుండదు -" అన్నది హేమ సంభాషణ అందుకొని.

"హాయిగా పీస్‌ఫుల్‌గా వుంటుందండి అక్కడ - నాకు థ్రిల్ కావాలని పెద్ద కోరికేమీలేదు. బి. ఏ. లో మంచి మార్కులు రావాలనే ఆశ తప్ప -" అన్నది నళిని.

"మీరంతా చాలా మామూలు మనుషులు -" అన్నట్లు నిర్లక్ష్యమైన చూపొకటి విసిరి కాఫీకప్పు అందుకుంది హేమ. తెల్లని నైలెక్సు చీర కట్టింది. దానిమీద అక్కడక్కడ జరీ ఎంబ్రాయిడరీ - తెల్లని జాకెట్టు - జుత్తు



క్రిందికిదువ్వి వెనక ఎనిమిది అంకెలాగ ముడి వేసింది. చెవులకి ముత్యాల లోలక్కులు - మెడలో ముత్యాలదండ - చేతులకి ముత్యాల గాజులు -

శాంతి దేవతలాగ - విచ్చిన మల్లెపువ్వులాగ - మంచి ముత్యంలాగ - మంచు కణంలాగ -

రామారావుకి ఉపమానాలు అంతకన్న రావడంలేదు.

భారతి ఒక్కరోజైనా ఇంత చక్కగా అలంకరించుకోడం రామారావు చూడలేదు - వాళ్ళ పదేళ్ళ దాంపత్య జీవితంలో -

మెడలో నగలు వేసుకుంటే, మంట పెడుతుందంటుంది - చెవులకి వొంటి ముత్యం దిద్దులుతప్ప తక్కినవి వాడితే ఎబ్బెట్టుగా వుంటాయట. "ఆఫీసుకి వెళ్లేవాళ్ళకి పూలు ఎందుకండీ! అదంతా ఇంటిదగ్గర" అంటుంది.

రంగురంగుల చీరెలు కడితే అంతా మననే చూస్తారు, సింపిల్‌గావుండాలి అంటుంది. ఇంకా చాలాచాలా అంటుంది -

అందుకే ఎప్పుడూ అలసిపోయిన దానిలాగ, వాడిన పువ్వులాగ, పాఠాలుచెప్పే పంతులమ్మలాగ వుంటుంది - పరిపూర్ణమైన స్త్రీలాగ, చల్లగా హాయిగా వుండదు. రామారావు ఊహలు రంగులు పులుముకుంటున్నాయి. భారతి జుత్తు ఆరబెట్టుకుంటూ వచ్చింది.

గులాబీరంగు చేనేత చీరె కట్టింది. చెవులకీ, మెడకీ ఏమీ లేవు - చేతులకి మాత్రం రెండు గాజులున్నాయి - ఇద్దరూ

కలిసి నెలకి పది వందలదాకా సంపాదిస్తున్నారు - చీరెలు కొనడానికి పిసినారితనం భారతికి. అన్నీ ఆలోచిస్తుంది - ఇలాంటివాళ్లు తాము సుఖపడరు. ఎదుటివాళ్ళని సుఖపడనివ్వరు. పేద ముత్తయిదువులాగ ఏమిటా వేషం!

ఆమెని చూసి మొహం చిట్లించుకున్నాడు రామారావు -

"వంట ఇంట్లో కూర్చుని మాట్లాడుకుందాం-రావోయ్ హేమా! ఈవేళ నువ్వుకూడా ఇక్కడే భోజనం చేస్తే బావుంటుంది-సరదాగా-" అన్నది -

"ఈరోజు మావారు బెంగుళూరునుంచి వస్తారు - మేం ఇద్దరం చూసుకొని పదిహేను రోజులైంది. మళ్ళీ వుంటారో-ఏమైనా వెడతారో - అందుకని వుండన్లే - పైగా ఎవరో అతిథులొస్తున్నారన్నావుగా-వాళ్లెవరూ లేనప్పుడు సరదాగా మనందరం భోజనంచేద్దాం - మీరు వెళ్లి పని చూసుకుంటూ వుండండి. మీ ఆయనేదో చెబుతున్నారు. వినేసి వస్తాను-"

"పద వదినా!" అని భారతిని మోచేత్తో పొడిచింది నళిని. ఇద్దరూ వంట ఇంట్లోకి పోయారు.

"నీ స్నేహితురాలంటావు గానీ - మీ ఇద్దరికీ ఎలా స్నేహం కలిసిందోనని నా కాశ్చర్యంగా వుంది. ఒకరికీ ఇంకొకరికి ఎందులోనూ పొంతనలేదు. నీ ఆలోచనలు వేరు ఆవిడ పద్ధతులు వేరు - ఏం వదినా? అన్నది నళిని కూరలు తరగడానికి కూర్చుని.



"చిన్నప్పుడు ఇద్దరం ఒకలానే వుండేవాళ్ళం. కాలం మాలో తెచ్చిన మార్పువల్ల ఇప్పుడలా కనిపిస్తున్నాం - హేమ వొట్టి పిచ్చిది నళినీ - దానికి మాట పొందిక చిన్నతనం నుంచీ తెలీదు, పైగా అమ్మమ్మ దగ్గర అతిగారంగా పెరిగింది. ఇప్పుడు బరువులూ బాధ్యతలూ లేవు. పిల్లలు కూడా లేరు - ఇంకా చిన్నతనం ఊహలు పోలేదు-" భారతి హేమను సమర్ధించడం యిష్టంలేనట్లు, సంభాషణ ఆపేసింది నళిని.

"మీ ఆయనకి సంభాషణా చతురత పుట్టుకతో అబ్బిన విద్యలావుంది - నిజంగా యు ఆర్ వెరీ వెరీ లక్కీ మై డియర్ భారతీదేవీ - అటువంటి భర్త లభించాలంటే నువ్వు క్రిందటి జన్మలో ఎన్ని పూజలుచేశావో - ఎన్ని నోములు నోచావోనని నేను అసూయపడుతున్నాను సుమీ - మేమూవున్నాం - ఒక్కొక్కరోజూ ఒకరి మొహం ఒకరు చూసుకోడానికే వుండదు. సరే-నేను వస్తా భారతీ-ఆడవాళ్ల క్లబ్‌లో ఎక్సిక్యూటివ్ కమిటీ మీటింగొకటి తగలడింది. అక్కడనుంచి కొద్దిగా ఓ స్నేహితురాల్ని చూసి లంచ్ టైమ్‌కి కొంప చేరుకుంటాను. వస్తాను - రామారావుగారూ-మా ఇంటికి మీరు తప్పకుండా రావాలి-మావారికి మిమ్మల్ని ఎప్పుడెప్పుడు పరిచయం చేయగలనా అని తహతహ లాడిపోతున్నా - వస్తాను నళినీకుమారీ - బై -" కారు స్టార్టు చేసుకుంటోంది హేమ. కారు కదిలిపోయేవరకూ అక్కడే నిలబడి, వెనక్కి తిరిగాడు రామారావు.

పుల్లిపాయలు కోస్తూ కళ్ళు తుడుచుకుంటోంది నళిని. కూర కలియబెడుతూ ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటోంది భారతి.

"వారానికి ఆరురోజులు ఆఫీసు, మిగిలిన ఒక్కరోజూ అతిథులూ అభ్యాగతులూనూ - ఎందుకొచ్చిన బాధ - హాయిగా - ఆవిడ చూడు కడిగిన ముత్యంలా ఎలా తయారై వచ్చిందో - బొట్టూ కాటుకా పెట్టుకుని అనువైన చీరె కట్టుకుని హాయిగా వుండరు - ఒక్కరోజైనా - దరిద్రం అంతా ఇక్కడేవుంది-" అన్నాడు. అంతకు క్రితం ఆదివారం రామారావు స్నేహితుడు పద్మనాభం, అతడి స్నేహితుడు ఆదిశేషూ, మిసెస్ పద్మనాభం - వచ్చారు - వాళ్లు లంచ్ తీసుకుని వెళ్లలేదు - టీకి కూడా వున్నారు. ఆపైన సినిమా అంటూ ప్రాణాలుతీశారు. సినిమా చూసొచ్చాక మళ్ళీ భోజనాలు - తనకీ నళినికీ క్షణం తీరలేదు. వున్న ఒక్క ఆదివారం వ్యర్థమైందని ఇద్దరూ బాధపడ్డారు -

"ఇవ్వాళ చాలా జాలీగా గడిచిందికదూ భారతీ - దె ఆర్ ఎ వెరీగుడ్ కంపెనీ-" అని బోలెను సంతోష పడిపోయాడు రామారావు -

బదలీ మీద వెళ్ళిపోతూ ఇంక ఎన్నడూ కనపడని వాళ్ళని ఈరోజు పిలిస్తే అనవసరం అంటున్నాడు-

పద్మనాభం అతని ఫ్రండు గనుకనా ? లేక .... ? భారతి ఇంక ఆలోచించదలచలేదు - చీటికీ మాటికీ జవాబు చెప్పే



అలవాటు లేనిదవడంచేత మళ్ళీ తన పనిలో నిమగ్నమై పోయింది -

కూరలన్నీ గిన్నెల్లోకి సర్ది చేతులు కడుక్కుంటూ, "ఈ సుడిగాలితో స్నేహం నాకేం నచ్చలేదొదినా - నువ్వే మనుకున్నాసరే! దాన్ని ఇక్కడితో కట్ చెయ్యడం శ్రేయస్కరం-" అంటూ చదువుకోడానికి వెళ్ళిపోయింది నళిని -

వంట పూర్తిచేసుకుని రామారావు ఆదేశంప్రకారం మంచి చీరె కట్టుకుని పెళ్ళిలో కొనిచ్చిన కెంపుల దిద్దులు, కంఠహారం ధరించి తలలో ఇన్ని కనకాంబరాలు పెట్టుకుని వచ్చింది అద్దంలో చూసుకుంటే నవ్వువచ్చింది భారతికి.

చిన్నప్పుడు తమ ఇంటిప్రక్క ఒక కుటుంబం వుండేది. వాళ్ళకి కిరాణాదుకాణం వుండేది. ఆయన భార్య నల్లగా లావుగా వుండేది. తలలో శేరు కనకాంబరాలు పెట్టుకుని మెడనిండా సందులేకుండా రాళ్ళ నగలు ధరించి, కొట్లో కూర్చుని బేరాలు చేసేది. చేతులనిండా డజన్లకొద్దీ బంగారం గాజులుండేవి ఆవిడకి. ఎవరైనా నగలకోసం అన్నట్లు వచ్చి ఆవిడని చంపి, ఆ నగలన్నీ ఎత్తుకుపోతాడేమో ననిపించేది భారతికి. ఇప్పుడు అద్దంలో తనని చూసుకుంటే ఆవిడే జ్ఞాపకం వచ్చింది. మగవాళ్ళ స్వభావం చాలా చిత్రంగా వుంటుంది - కాలేజీ రోజుల్లో....

తన నిడుపాటి జడ, నుదుట పెద్ద బొట్టూ, ఇవే తనకి అందం అంటూ ఎలా కీర్తించేవాడో రామారావు! బాహ్య సౌందర్యం, అంతః సౌందర్యం అంటూ తెగ పొగిడేవాడు-

"మా భారతి నా అదృష్టదేవత - నా కుడికన్ను -" ఇప్పటికీ స్నేహితులతో అంటాడు. మరి ఇవ్వాళో? దరిదం అంతా భారతి ఇంట్లోనే వుందంటున్నాడు? ఈ పదేళ్లుగా రామారావులో టెంప్టేషన్ని ఇంత దగ్గరగా తనెప్పుడూ చూడలేదు - అవును - అతనూ ఒక మామూలు మనిషి! తన భర్త శ్రీరామచంద్రుడుగా వుండాలనీ తనను తప్ప కన్నెత్తి చూడకూడదనీ, అందరు ఆడవాళ్ళల్లా ఇలా చాలా మామూలుగా ఆలోచిస్తోందేమిటి తను? మెల్లిగా మెడలో హారాన్ని తీసివేసి దాచింది. తనకది నప్పదు. నగలు వేసుకుని మురిసిపోవడం ఒక్కటే తనకి జీవన ధ్యేయం కాదు-

"ఇవ్వాళ మీ హేమనికూడా వుండమనకపోయావా?" అన్నాడు రామారావు భోజనం దగ్గర.

"వదినెంతో బ్రతిమిలాడిం దన్నయ్యా! కానీ ఆవిడ పతిదేవు డివ్వాళ బెంగుళూరునుంచి వస్తున్నాట్ట - పైగా ఎక్కడో మీటింగట - వెళ్లిపోయింది-ఆవిడ మన మాటలు వినిపించుకుంటుందా? తన ధోరణి తనది!" అని వదినెగార్ని సమర్థించింది నళిని.

"భారతి వుండమన్లేదు-గట్టిగా వుండమంటే వుండేదే?" అనుకున్నాడు రామారావు -

అతిథులు వెళ్ళాక అలసిపోయినట్లు నిద్రపోయింది భారతి. సాయంత్రం ఆరు గంటలవరకూ లేవలేదు-స్నేహితురాలి ఇంటికంటూ వెళ్ళిపోయింది నళిని. రామారావు స్నానం



చేసి, ఎక్కడికైనా వెడితే బావుండునని ఆలోచిస్తూ కూర్చున్నాడు.

కొలీగ్ కృష్ణమోహన్ ఇంటికి వెళ్ళాలని రెడీ అయ్యాడు. అతనితో ఆఫీసులు విషయాలు కొన్ని మాట్లాడాలి-అవేం పెద్ద అర్జెంటు కాదు - భారతి ఎక్కడికైనా వెళ్ళాలంటే ఆమెతో వెళ్ళాలనుకున్నాడు - ఆరుగంటలకి నిద్రలేచి, కాఫీకప్పుతో వచ్చి అతని ఎదురుగా కూర్చుని, "ఎక్కడికో బయల్దేరినట్లుంది-" అన్నది -

"ఎంతసేపిలా కూర్చోను. సండేకూడా బయటికి వెడదామని బయల్దేరాను" - నిష్ఠురంగా అన్నాడు-

"ఇవ్వాళ చాలా అలసిపోయాను - ఆఫీసులో బాగా పని ఎక్కువగా వుంది - ఇంట్లోకూడా - అందుకోసం కాస్త విశ్రాంతిగా వుంటుందని నిద్రపోయాను-" సంజాయిషీ యిచ్చుకుంటున్నట్లుగా అంది.

"ఈ స్ట్రెయిన్ నువ్వు తట్టుకోలేవు - హాయిగా రిజైన్ చేసి ఇంటిపట్టున వుందూ -

చకితురాలైంది భారతి - అతని కన్న ఓ రెండువందల రూపాయలు ఎక్కువ సంపాదిస్తున్నది ఆమె. ఇప్పుడిప్పుడే మొగ్గ తొడిగి, పుష్పించబోతున్న సంసారం - కష్ట సుఖాలు ఎరగనివాడా? ప్రతి మగవాడూ ఇంతేనేమో!—

"వస్తాను. తలుపేసుకో-" విసుగ్గా చెప్పులు తగిలించుకుని బయల్దేరాడు -

కొంత దూరం నడుచుకుంటూ వెళ్ళేడు - కృష్ణ

మోహన్ ఇంటికి పోబుద్ధి కాలేదు - వాడు భార్యని తీసు
కుని ఏ సినిమాకో వెళ్ళుంటాడు - ఆంధ్రదేశంలో రిలాక్సే
షన్ సినిమా ఒక్కటే - అందునా ఆదివారమే చాలామంది
సినిమాకి పోతారు - సినిమా చూడ్డంతోనే ఆదివారాన్ని
ఎంజాయిచేసినట్లు ఆనందిస్తారు -

మళ్ళీ కాళ్లు అటువైపే నడిచినాయి - పొరపాటున
ఇంట్లో వుండకూడదా వాడు!

"కమిన్ మై డియర్ రామారావు - యు ఆర్ వెరీ
కైండ్ - చాలా కాలానికి మా గృహాన్ని పావనంచేశావు-"
పెద్ద పెద్ద పువ్వులున్న లుంగీ చుట్టుకుని, పైన బనీనుకూడా
లేకుండా ఈజీ ఛైర్లో కూర్చుని పేపరు చూస్తున్నాడు కృష్ణ
మోహన్.

ఓసారి అల్లాంటిలుంగీ కొనుక్కుంటే దాన్ని తడప
నైనా లేకుండానే గిన్నెలవాడి కిచ్చేసింది భారతి -

"అల్లాంటి డ్రెస్‌లో మిమ్మల్ని నేను చూడలేను"
అంటూ -

"ఈరోజు నీ శ్రీమతితో ఏం ఎంగేజిమెంటులేదా!
లేక శ్రీమతే ఇక్కడ లేదా! ఏం సంగతి?" మళ్లీ అడిగాడు
కృష్ణమోహన్ -

"నువ్వింట్లో వున్నావేం ఇవాళ - ?

"థర్డ్‌వీక్ కాదు భాయ్! ఇంట్లోవుండక ఎక్కడుంటాం!
మీరిద్దరూ సంపాదిస్తున్నారు గనుక నీకు ఇల్లాంటి కష్టాలు
తెలీవు! నేను తెచ్చే నాలుగు వందల్లో వీక్‌ఎండ్ ప్రోగ్రామ్స
ఎఫర్డ్ చెయ్యగలనా!"



చిన్న ఇల్లు కృష్ణమోహన్‌ది. నలుగురు పిల్లలు -
ముప్పై ఏళ్ళకే ముసలిదానిలా వుంది అతని భార్య - బాగా
మాసిపోయిన నేతచీరె కట్టుకుని లోపల అటూ ఇటూ తిరుగు
తోంది-బహుశా వంట చేసుకుంటూ వుండి వుంటుంది. ఆవిడ
కళ్ళక్రింద నల్లనిగుంటలు, జుత్తులో తెల్ల వెంట్రుకలు -? అది
వరకే చూశాడు రామారావు.

"ఇవ్వాళ చాలా డల్‌గావుంది బ్రదర్! హేవర్స్
ఒక క్వార్టర్ వుంది. వేసుకుందామా?" అన్నాడు కృష్ణ
మోహన్.

రామారావుకీ డల్‌గానే వుంది. అయినా అతనికి
కృష్ణమోహన్‌తో కలసి తీసుకోడం యిష్టంలేదు - థర్డ్‌వీక్
భార్యని బయటికి తీసుకు వెళ్ళడానికి డబ్బులేనివాడు విస్కీ
ఎల్లా కొనగలడు? అందునా, ఆర్థికంగా తనకన్నా తక్కువ
స్థాయిలో వున్నవాడి దగ్గర్నుంచీ డ్రింక్ పుచ్చుకోడం - ఏదో
తప్పు చేస్తున్నట్లుగా వుంది రామారావుకి.

"అలాంటిదేం వద్దుభాయ్- ఆఫీసులో మొన్న జరిగిన
దాని గురించి ఏదైనా మాట్లాడదామని వచ్చాను - మనలో
మనకెందుకీ మర్యాదలు" అన్నాడు.

"నీకు మర్యాదకాదు రామారావ్ - ఈరోజు ఎల్లా
గైనా నేను తీసుకోవాలి తప్పదు - కంపెనీ దొరికినందుకు
సంతోషించాను - మీ శ్రీమతి కోప్పడుతుందని భయమైతే
ఐ డోంట్ కంపెల్ యూ -" ఈ మాటల ధోరణి చూస్తే
వళ్లుమంట రామారావుకి. తనతో ఎవరు మాట్లాడినా
శ్రీమతి ప్రసక్తి లేకుండా వుండరు. వాళ్ళ శ్రీమతులన్న

గురించి తను అసలు ప్రస్తావించడు. మగవాళ్ళకికూడా జెలసీ
వుంటుదంటే నవ్వొస్తుంది రామారావుకి.

కృష్ణమోహన్ లోపలికివెళ్ళి షర్టు తగిలించుకుని,
చెప్పులు వేసుకుని, జస్ట్ ఎ మినిట్ రామారావ్ - అదిగో ఆ
సందు మొదట కిల్లీ కొట్లోనుంచీ సోడాలో తెస్తాను -"
అంటూ బయటికి వెళ్ళాడు. ఐదు నిమిషాల్లో తిరిగివచ్చాడు.

"వొరేయ్ కిష్టిగా రెండు గ్లాసులు తీసుకురారా!"
అని లోపలికి కేకేశాడు. ఏడేళ్ళ కిట్టిగాడు నల్లగా మట్టిపట్టిన
రెండు గ్లాసులు తెచ్చాడు.

"ఒసేయ్ రాజ్యం ఇల్లాగేనటే గ్లాసులు తగలడేది!
కాస్త సబ్బో సీకాయో వేసి శుభ్రంగా కడిగి పంపించు -
ఇంటి శుభ్రం తెలీదు - అల్లాగే కాసిన్ని బజ్జీలువేసి పంపించు
కాఫీ గట్రా ఏం అక్కర్లేదు -" అని ఫర్మానా పంపించాడు.

అప్పటివరకూ వంటఇంట్లో కూర్చుని కూర్చుని విసు
గేసిన ఆ ఇల్లాలికి మళ్ళీ పనిచెబుతూంటే కష్టంగావుంది
రామారావుకి.

రెండు పెగ్గులు పడేసరికి ఎక్కడలేని హుషారు వచ్చే
సింది కృష్ణమోహన్‌కి. ఆఫీసులో స్టెనోగ్రాఫర్ నాగమణికీ
మేనేజరు సుబ్బారావుకీ ఎల్లాంటి సంబంధాలున్నాయో,
హెడ్‌క్లర్కు సోమసుందరానికీ, యుడిసి సుందరీబాయికీ
ఎలాంటి చుట్టరికమో - అన్నీ గబగబా చెప్పేస్తున్నాడు -
ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళ క్యారెక్టర్ భద్రంగా వుండటం
చాలా కష్టమని స్టేట్‌మెంటు ఇచ్చాడు - కృష్ణమోహన్
బారినుంచి తప్పించుకొచ్చేసరికి రాత్రి పది గంటలైంది.



"ఏమండీ! ఇంత లేటు" భారతి అడిగింది -

"ఏవో ఆఫీసు గొడవలు - కృష్ణమోహన్ ఇంటికి
వెళ్ళొచ్చాను -"

భారతి ఏదో చెప్పాలని నోరు విప్పిందిగానీ, మరు
క్షణంలోనే విరమించుకున్నట్లు, అటు తిరిగిపోయింది -

"సారీ భారతీ నిన్ను సుఖపెట్టలేక పోయాను -
తొందరపడి పెళ్ళి చేసుకున్నాను - నీకన్న ఎక్కువ సంపా
దించేవాడూ - మంచి హోదాలో వున్నవాడూ అయితే -"
ఆమె భుజంమీద చెయ్యి వేస్తూ అన్నాడు -

"ఉద్యోగం చెయ్యడం కష్టం అని నేనెప్పుడూ
అనుకోలేదు. ఎకౌంట్స్ టెస్టేదో పాస్ అయితే మీకు
మాత్రం ప్రమోషన్ రాదా ఏం? అది చదివి రాయడానికి
మీకు బద్ధకం. ఆపైన అందరి మాటలూ విని జావకారి
పోతారు - వాళ్ళకి మిమ్మల్ని చూస్తే జెలసీ - ఆ జెలసీని
ఏదో అని తీర్చుకుంటారు - ఆడదానికన్నా ఏ విషయంలో
తను తక్కువగా వుండడాన్ని మగవాడు భరించలేడు. ఎందు
కంటే మగవాడికి తను అధికుడననే భావం నర నరంలోనూ
జీర్ణించి పోయింది గనుక. నాకు మీ అవస్థ తెలుసు - ఆ
టెస్టేదో పాస్ అవండి - సమస్యలన్నీ తీరిపోతాయి -"
అన్నది భారతి -

భారతి అంత వివేకంతో, విజ్ఞతతో మాట్లాడం
రామారావుకి ఏదో అసంతృప్తి కలుగజేసింది - బహుశా
ఆమె చెప్పేది నిజమేనేమో! కళ్ళు మూసుకుని పడుకున్నాడు
రామారావు - కలలోకి హేమ వచ్చింది.

దివినుంచీ దిగి వచ్చిన దేవకన్యలాగ.

ఇప్పుడు హేమ రోజూ వస్తోంది భారతి ఇంటికి –
భారతి తనతో ఎక్కువ మాట్లాడకపోయినా నళిని
చమత్కారంగా మాట్లాడినా పట్టించుకోదు. ఆమె ఎప్పుడు
వచ్చినా రామారావు ఇంట్లో వున్నప్పుడే....

"మీరుచక్కగా ఎప్పుడూ ఇంట్లోనే వుంటారు – ఇద్దరు
కలిసి హాయిగా భోజనం చేస్తారు – మిమ్మల్ని చూస్తుంటే
నాకు చాలా అసూయ–" అంటుంది –

తన భర్త గురించి చెబుతూ వుంటుంది.

ఉద్యోగం చేసే ఆడవాళ్ళతో సంసారం కొంచెం
కష్టమే వాళ్ళూ వీళ్ళూకూడా అలసిపోయి వుంటారు –" అని
వ్యాఖ్యానాలు చేస్తూ వుంటుంది –

ఆరోజు ఆఫీసునుంచి బయటపడి శిరీషకి చాక్లెట్లు కొన
డానికి ఫ్యాన్సీ షాపులోకి వెడుతూంటే,

"ఏమండోయ్ రామారావుగారూ –" అని పిలిచింది
ఒక ఆడగొంతు –

వెనక్కి తిరిగి చూస్తే, చేతినిండా ప్యాకెట్లతో
బట్టలషాపునుంచి వస్తోంది హేమ –

"ఆఫీసు నుంచేనా ?" అంది.

తల వూపాడు.

"కాఫీ త్రాగి పోదాం రండి –" అని డోరు తీసింది –

మనోరమదగ్గర దిగారు.

"ఇలా రావడం – నాకేం బాగాలేదు – ఎవరైనా
అపార్థం చేసుకోగలరు–" సంశయంగా అన్నాడు రామారావు–



హేమ గట్టిగా నవ్వింది –

"అపార్థం చేసుకునేవాళ్ళ కదే ఉద్యోగం – వాళ్ళ
ఖర్మకి మనమేం చేస్తాం – పదండి –" అని ముందుకు
వెళ్ళింది –

మెనూకార్డుచూసి ఏవో ఆర్డరు చేసింది.

"జీవితం చాలా మోనాటనస్‌గా అనిపిస్తుందికదూ?"
అంది ఉన్నట్లుండి –

"ఎందుకనో ?" అన్నాడు రామారావు –

"ఏమో ఇంటిమీదా, భర్తమీదా ఎన్నో ఆశలు
పెంచుకుని పెళ్ళి చేసుకున్నాను – మీలాంటి భర్త దొరికితే
ఈ డబ్బూ, ఈ దర్జా అన్నీ త్యాగంచేసి పాదాలమీద
పడుదును – నిజంగా భారతి గనుక మిమ్మల్ని అలా వదిలేసి
ఉద్యోగం అంటూ తిరుగుతుందిగానీ నేనైతే ఎంత మంచి
ఉద్యోగం వచ్చినా వదిలేసి వుందును. ఆడదానికి భర్త
ప్రేమకన్నా కావల్సింది ఏముందండీ ! ప్లీజ్ నన్ను మిస్
అండర్‌స్టాండ్ చేసుకోకండి. నాది ఎవరితోనైనా చనువుగా
సూటిగా మాట్లాడే స్వభావం –"

బేరర్ టిఫిన్ తెచ్చి టేబిల్‌మీద సర్దాడు.

"ఏమిటో ! ఈ విజయవాడ వట్టి డర్టీప్లేస్ – వెధ
స్కాండల్స్–" విసుక్కుంటూ ప్లేటు ముందుకి తీసుకుంది.

"మా ఇంటికి పోదాం రండి –" అన్నాడు, తరువాత
కారు దగ్గరకు వెళ్ళినప్పుడు.

"మీ నళినీకుమారికి నన్ను చూస్తే అసలు కిట్టదు.
మా ఇంటి మొత్తంమీద నాతో బాగా మాట్లాడేదిమీరే–

నాకూ చాలామంది స్నేహితులున్నారు. అయితే అదంతా ఒక కృత్రిమమైన సొసైటీ– మీఇల్లు నాకు చాలా హాయిగా వుంటుంది. మీ ప్రేమలూ, అపేక్షలూ చూస్తే నాకు చాలా ఆనందం – మా ఇంట్లో ఏముంది? ఎవరి దోవన వాళ్ళం వుంటాం – అందుకే మీ ఇంటికి ఎక్కువ వస్తూంటాను – మీరంతా ఏమనుకుంటారో ఏమో!'' ఆమె చెప్తూన్న మాటలు వింటే జాలి కలిగింది రామారావుకి.

''మిమ్మల్ని ఇంటిదగ్గర డ్రాప్‌చేసి వెళ్ళాలని వుంది. గానీ! వెధవ జనం మంచివాళ్ళు కారు – వస్తాను రామా రావుగారూ – బై!! మనం ఇక్కడ కలసిన సంగతి ఇంట్లో అనకండేం!''

రామారావు రిక్షా ఎక్కి ఇంటికి వచ్చాడు –

ఎదురుగా నళినీ, భారతీ నవ్వుకుంటూ కనపడ్డారు – ఎంత సేపూ వాళ్ళిద్దరే నవ్వుకుంటారుగానీ, ఇంకెవరితోనూ జత కలవరు! ఇద్దరికీ చదువుకున్నామన్న గర్వం –

అందరూ భోజనాలుచేసి వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు –

వాకిట్లో కారు ఆగింది. గచ్చకాయరంగు ఫియెట్ కారు.

హాలులో గడియారం పది గంటలు కొట్టింది.

''వెరీ సారీ భారతీ! ఈ టైంలో డిస్టర్బ చేసినం దుకు! కాస్త ప్రేమవుంది చూశావ్. అది ఇల్లా లాక్కొచ్చింది. నిన్ను చూసి నాలుగురోజులైందా? ఏం తోచలేదు–బాంబే నుంచీ ఓ ఫ్రెండు చీరెలు తెచ్చింది – నువ్వుకూడా ఒకటి



తీసుకుంటా వేమోనని వచ్చాను–'' కుర్చీలో కూర్చుని ప్యాకెట్ భారతి వళ్ళో పడేసింది హేమ.

ఓ నిమిషం తరువాత ఆశ్చర్యంనుంచి తేరుకుని, ''నాకోసం నీ కెందుకంత శ్రమ; హేమా! భోజనంచేశావా? అంది భారతి.

''భోజనం కేముందిలే భారతీ. భోజనం విషయంలో నే నంత పర్టిక్యులర్‌గా వుండను – మా ఇంట్లో ఒకరి నొకరు తిన్నావా? లేదా? అని అడిగే ఆచారంలేదు – ఒక్కదాన్ని కూర్చుని తినడానికి బోర్ కొడుతుంది. ఎదురుగా రాక్షసి లాగ వంటావిడ ఒకతె–''

''మా ఇంట్లో భోజనం చేయ్యండి హేమలతగారూ – భారతీ – ఆవిడకి భోజనం పెట్టు–'' అన్నాడు రామారావు –

''వద్దు భారతీ! నీ కెందుకిప్పుడు శ్రమ – నాకు ఇల్లా వస్తూలుండడం అలవాటే–'' హేమ భారతి చెయ్యిపట్టి కూర్చోపెట్టింది–

''నువ్వు కూర్చో వదినా! నేను రెండు నిమిషాల్లో ఆవిడకి వడ్డించి పిలుస్తాను–'' అని లోపలికి పోయింది నళిని.

''వద్దమ్మా నళినీకుమారీ–'' అంటూ అడ్డగించబోయిన, హేమని వారించాడు రామారావు–

మొత్తానికి ముగ్గురూ చూట్టూ కూర్చుని హేమకి అన్నం తినిపించారు.

''మా ఇంట్లో ఈ సాదా భోజనం మీ కెలా

వుంటుందో? మీ ఇంట్లో ఏం తింటారో ఏమో!" అని రామారావు అంటే,

"మా ఇంట్లో ఏం తిన్నా ఇక్కడ తిన్నంత ఆనందం నా కెప్పుడూ కలగలేదంటే నమ్మండి," అని హేమ అనడం, మధ్య మధ్యలో "ఆవిడ కింకొంచెం నెయ్యి వెయ్యక పోయావా!" అనీ, "ఇంకేమైనా కావాలేమో కనుక్కో—" అనీ రామారావు భార్యకి పురమాయించడం చూస్తే నళినికి కోపం వచ్చింది—

అన్నయ్యకి మరీ మతిపోతోంది. అర్ధరాత్రి ఏమిటీ కొలువు - చదువు దండగ—" అని విసుక్కుంది. హేమ కారు కదిలేసరికి పన్నెండు గంటలైంది. ఉసూరుమంటూ పుస్తకాలు సర్దుకుని పడుకుంది నళిని —

స్నేహితురాలంటావు - సరిగా పలకరించవేం — పాపం అంతదూరం నించీ రాత్రి పది గంటలప్పుడు వస్తే - కర్టెసీ కోసం అయినా చిరునవ్వు నవ్వవు - మరీ అంత కఠినంగా వుంటే ఎలా!" అన్నాడు రామారావు భార్యతో -

"నా బదులుకూడా మీరు మర్యాదలు చేశారుగా! నన్నుగురించి అదేం పట్టించుకోదులెండి—" అన్నది భారతి.

"వొట్టి రెటమతం మనిషివి —" అన్నాడు రామారావు -

"చాలారోజులకి గ్రహించారు. బట్ ఇట్ ఈజ్ టూ లేట్—" అన్నది భారతి—

రామారావు మరి మాట్లాడలేదు —



మరునాడు రాత్రి తొమ్మిదిన్నరకి టేబిల్ మీద భోజనాలు వడ్డిస్తుండగా హేమ కారు వచ్చింది—

అన్న వినకుండా, "దిగబడింది రాక్షసి—" అన్నది నళిని—

"ఊరుకో— నళినీ—బావుండదు—" అని.

"రావోయ్ హేమా! నీమాటే అనుకుంటున్నా - పాపం భోజనం చేశావో లేదో అని — సమయానికొచ్చావు — నువ్వు రాకపోతే ఈరోజు మాకు భోజనం సయించేది కాదు సుమా!" అని ఎదురు వెళ్లింది భారతి.

ఈసారి హేమ కొంచెం ఆశ్చర్యపడింది. అయినా బయటపడ్డం ఇష్టంలేక, "మరి నిన్నటి చీరె వుంచుకుంటావా! డబ్బు యిచ్చేస్తాను—" అన్నది—

"నా చీరెకి నువ్వు ఇవ్వడం దేనికి? నేనే ఇస్తాను. పాపం నువ్వు ఎంతో ఇష్టంగా తెచ్చిన చీరె ఎందుకు వుంచుకోనూ!" అన్నది భారతి.

హేమకన్న రెట్టింపు వేగంతో భారతి మాట్లాడుతోంది.

ప్రతి విషయానికీ హేమని ఫ్లాటర్ చేస్తోంది—

"అతి తెలివి ప్రదర్శించకు—నీకు ఆవిడ్ని చూస్తేజలసీ!" అన్నాడు రామారావు హేమ వెళ్ళాక—

"అదేమిటండీ! అది నా ఫ్రెండు — మేం ఇద్దరం ఏదో అనుకుంటాం మధ్యన మీ కెందుకూ!" అంది గడుసుగా భారతి — రామారావు మాట్లాడే అవకాశం లేకుండా—

ఆ మరునాడు సాయంత్రం రింగురోడ్డువైపు కారు పోనిస్తూ, "మీ ఆవిడ మరీ తెలివిగలది! నేనిక మీ ఇంటికి రాను సార్! కానీ మిమ్మల్ని చూడందే నేను వుండలేను - మనిద్దరం అప్పుడప్పుడూ ఇలాగే కలుసుకుంటూ వుందాం," అని హేమ అన్నప్పుడు - 'సిరిరా మోకాలొడ్డువాడుంటాడా' అనుకున్నాడు రామారావు. తనకి ఒక సమస్య పరిష్కారం అయిపోయింది. హేమ మొదట్లో నాలుగైదుసార్లు భారతి కోసమే వచ్చింది. ఆ తరువాతంతా తనకోసమే వస్తుందని రామారావుకి అర్థం అయింది -

ఎప్పుడూ రేసెస్‌కి వెడుతూ, పేకాట ఆడుతూ, డ్రింక్ పార్టీలుకు ఎటెండ్ అవుతూ భార్యని ఉపేక్షించిన హేమ భర్తమీద రామారావుకి కోపం వచ్చింది.

ఎంత సెక్సీగా వుంటుంది హేమ!

హేమ రాక భారతికి యిష్టంవుండదు. భారతి చాలా తెలివిగలది-ఆవులిస్తే పేగులు లెక్కబెడుతుంది -

రామారావు హేమని బయట కలుసుకోవలసి వచ్చినందుకు చాలా సంతోషిస్తున్నాడని హేమ కనిపెట్టేసింది. కానీ మళ్ళీ రెండురోజుల తరువాత ఆమె భారతి ఇంటికి రానే వచ్చింది.

అప్పుడు రామారావు ఇంట్లోలేడు ఎవరో ఫ్రెండ్ పెళ్ళికి వెళ్ళాడు. తను ప్రత్యేకం భారతికోసమే వచ్చానంటుంది హేమ.



కూర్చోవోయ్ - ఏం తీసుకుంటావ్ కాఫీనా కూల్ డ్రింకా?" అని మర్యాద చేసింది భారతి.

"మీవారు లేరా ఏం!" హేమ ఇల్లంతా కళ్ళతోనే వెతుకుతూ.

రామారావు అప్పుడు రాడని భారతికీ నళినికీ కూడా తెలుసు.

"రావాలి-ఈ వేళప్పుడు ఆయన ఇంట్లోనే వుంటారు. ఇప్పుడే వస్తానని వెళ్ళారు-" అనేసింది భారతి.

హేమ చాలా ఇబ్బందిగా ఓ అరగంట గడిపింది.

ఇవ్వాళ మీరు మూడ్‌లో లేరు? ఏమిటో కథ?" అంది నళిని.

"తలనెప్పిగా వుందోయ్ - రిలీఫ్‌కోసం మీ ఇంటికొచ్చాను-"

హేమ సమాధానం విని వదినా మరదళ్ళిద్దరూ కళ్ళతో నవ్వుకున్నారు.

"పాపం ఇక్కడా రిలీఫ్‌గా లేదు-" పెదవులు చప్పరించింది నళిని.

"ఏం కబుర్లూ చెప్పడంలేదు ఇవ్వాళ నువ్వు - మీ మామగారేమంటున్నాడు?" భారతి కవ్వించింది -

"ఏమంటాడు? కారుకి పెట్రో లెక్కువవుతోందంటాడు! బట్టలషాపునుంచి బిల్లులు ఎక్కువ వచ్చిపడుతున్నాయంటాడు. ఫోన్ కాల్స్ ఎక్కువైపోయాయంటాడు! ఓల్డ్ జాకాల్?" నళిని హేమని అనుకరిస్తూ నవ్వింది.

మరో అరగంట గడిచినా రామారావు రాలేదు -

"నేనొస్తా భారతీ - వెళ్లి పడుకుంటాను - ఓ స్లీపింగ్ డోస్ వేసుకునీ -" లేచింది హేమ.

"భోజనంచేసి పోవోయ్ - మనందరం కలసి తిని మూడురోజులు దాటిపోయింది-"

"అన్నయ్య లేనిదే ఏం సరదా వదినా! వాడినికూడా రానియ్!" నళిని భారతిని మోచేత్తో పొడిచింది.

"భోజనానిదేం వుందోయ్ రేపొస్తాలే-ఇంక వెడతా-" నిరాశగా లేచింది హేమ-

"పాపం మీరు అనుకున్న రిలీఫ్ ఇక్కడకూడా దొరక లేదు. ఈవేళప్పుడు రింగ్‌రోడ్డుమీదుగా డ్రయివ్ చేసు కుంటూ పోతే రిలీఫ్ దొరుకుతుంది - హాయిగా వుంటుంది - ష్యూర్-నామాట నమ్మండి."

హేమ విసురుగా కారు తలుపు వేసుకుంది.

నళిని విరగబడి నవ్వడం చూసి," ఛీ! పోకిరిపిల్లా! మరీ అల్లా ఏడిపిస్తే ఉడికిపోదూ పాపం!" అని ఆ నవ్వులో శృతికలిపింది భారతి -

"నిన్న మీరుంటారని ఎంతో ఆశగా మీ ఇంటికి వచ్చాను-ఎక్కడికి పోయారు. వస్తారని అరగంట కూర్చున్నా గంట కూర్చున్నా-పైగా వాళ్ళిద్దరూ ఒకటే బాణాలు విసరటం-ఎల్లాగైనా తెలివిగలవాళ్ళుకదూ! నాకు వొళ్లు మండిపోయింది. ఇల్లా అమాంతం మిమ్మల్ని లేవదీసుకు పోతే రోగం వదులుతుం దనిపించింది-" గారంగా అంటోంది హేమ.



మేరీస్టెల్లా కాలేజీవైపు నడుస్తున్నారు ఇద్దరూ-చీకటి అలుముకుంది. వుండీ వుండీ ఒక కారో ఒక లారీయో వెళుతుంది -

"లేచిరమ్మంటే - ఈ క్షణంలో రెడీ!" రామారావు నవ్వాడు -

"మీ మగాళ్ళ మాటలు వొట్టి అబద్ధాలు-మీ భారతి మీకు సంపాదించి పెడుతుంది-నేనేం చేస్తాను తిని కూర్చుం టాను-"

"తిన్నా ఎదురుగా కూర్చుంటావుగా!"

"నాకేం యాభై వేల రూపాయలు మా నాయనమ్మ యిచ్చింది - దాంతో వ్యాపారం చేస్తే హాయిగా గడిచి పోతుంది - మరి మీరు రారుగా?"

"ఈ సంభాషం వదిలెయ్ హేమా! నాకేం బాగా లేదు-" అన్నాడు రామారావు -

ఇంతలో అటు నుంచి ఓ స్కూటర్ పోయింది.

స్కూటర్ తోలేది పొడుగు జుట్టున్న కుర్రవాడు.

వెనక కూర్చున్నది సాక్షాత్తూ నళినే!

"నిన్న నన్ను రింగ్‌రోడ్డు అంటూ ఎగతాళిచేసింది. చూడండి - మీ చెల్లెలి ప్రతాపం వదినెగార్ని మంచి చేసుకొని-"

ఆ పొడుగు జుట్టు కుర్రవాణ్ని రామారావు గుర్తుపట్టాడు.

వాడు పెద్దమామయ్య కొడుకు భాస్కర్. నళిని చదువుకోగానే ఇద్దరికీ పెళ్ళి చెయ్యాలని అందరూ అనుకుంటున్నారు, ఇప్పుడా కథంతా హేమకి చెప్పడం అనవసరం అనిపించింది రామారావుకి, అతనికి పట్టిందల్లా ఒకటేసందేహం తామిద్దర్నీ నళిని చూసి వుంటుందా ? అని–

"ఏమిటి సార్ ! అల్లా అయిపోయారు ?"

"ఏం ! లేదు హేమా ! వెళ్ళిపోదాం ఇంటికి– నీ కింత మొండిధైర్యం ఎలా వచ్చిందో నాకు తెలీదు – మీ మామగారి ప్రతిష్ఠ బజారుపాలవుతుంది –"

హేమ విరగబడి నవ్వుతోంది –

"మీ చెల్లివలన మీ ప్రతిష్ఠ మాటేమిటో !"

రామారావు ఏదో చెప్పబోయాడు – కానీ హేమ వినిపించుకోలేదు –

"ఈ లోకంలో ఎవరి ఆనందం వారిది – ఎవరో ఏదో అంటారనీ, ఏదో అవుతుందని దొరికినదాన్ని వదులుకోడం పిరికితనం అంటాను నేను – అనేవాళ్ళ నోళ్ళు మూయించలేని అసమర్థురాలినేం కాను –

ఇంక రామారావు మాట్లాడలేదు –

అతని మనసంతా చీకాకుగా అయిపోయింది.



ఇంటికొచ్చేసరికి నళిని యుద్ధానికి సిద్ధంగా వుంటుందనీ దాన్ని ఎదుర్కోడానికి ఏమేమి చెప్పాలో ఆలోచించుకుంటూ వచ్చాడు –

నళిని ఏమీ ఎరగనట్టు పడక కుర్చీకి చేరబడి చదువుకుంటోంది. భారతి కూడా చదువుకుంటూ లేచి వచ్చి తలుపు తీసింది. తెల్లని ఇస్త్రీ చీర కట్టింది. తలలో మల్లెపూలు తురిమింది. చాలా ఫ్రెష్‌గా వుంది.

"ఇంత లేటేమిటండీ రోజూ !" అని అందంగా విసుక్కుంటూ భోజనం వడ్డించింది.

"కృష్ణమోహన్ మా యూనియన్ సెక్రటరీ కదూ! వాడితో మాట్లాడ్డానికి వెళ్ళాను – ఇంతసేపూ కూర్చోబెట్టాడు–" అబద్ధం వచ్చేసింది. నళిని తనని చూసివుండదు అని గట్టిగా అనుకున్నాక– "ఆహా ! ఏం మాటలో ఏమో!" నవ్వింది– ఆమె ఎందుకు నవ్విందో మరునాడు ఆఫీసుకి వెళ్లాక అర్థం అయింది.

"నిన్న మీ ఇంటికి వెళ్ళాను భాయ్ – నువ్వు లేవు– చెల్లెమ్మ నడిగి ఓ పాతిక అప్పు తెచ్చుకున్నా–" అని కృష్ణమోహన్ చెప్పాక.

తను అబద్ధాలకోరుగా– ఇంకా– ఇంకా ఎన్ని విధాలుగా వూహించుకుంటోందో భారతి –

సీటో కూర్చుంటే, ప్యూన్ వచ్చి చెప్పాడు.

"మీకు ఫోన్ వచ్చింది సార్ !" అని.

"హల్లో– హేమా హియర్!"

"రామారావ్ స్పీకింగ్ –"

"ఏం సంగతి! మూడ్‌లో లేరా? ఏమంది మీ చెల్లెమ్మ!"

ఎదురుగా కుర్చీలో మేనేజర్.

"అహా! అలాగా! సరే. నేను సాయంత్రం రావడానికి వీల్లేదు. అర్జెంటు పనొచ్చింది– రేపు కలుద్దాం –" అని పెట్టేశాడు– సిగ్గులేదు హేమకి– అనుకున్నాడు.

ఇంటికి వస్తూంటే గుమ్మంలో కారు కనిపించింది. రిక్షా వెనక్కి తిప్పమన్నాడు. గిల్టీ కాన్షెన్స్ ఫీలవుతూ – తిరిగి తిరిగి తొమ్మిదింటికి వచ్చాడు.

ఇంట్లోనుంచీ సంభాషణ వినపడుతోంది –

"నువ్వు అన్నయ్యని ఏమీ అనకపోవడం చూస్తే నీ మీద నాకు వొళ్ళు మండిపోతోంది వదినా! అదేం గొప్ప అనుకుంటున్నావా?" నళిని గొంతు –

"ఏం చెయ్యమన్నావు?– మీ పాదదాసిని ఏలుకోండి – దాన్ని విడిచి పెట్టండి – మన పెళ్ళయిన తొలి రోజులు గుర్తు తెచ్చుకోండి– అని పాదాలు పట్టుకుని ఏడవమన్నావా? గట్టిగా అరచి నలుగురికీ చెప్పి తల బాదుకోమన్నావా? నువ్వు చెప్పు –" ఇది భారతి జవాబు, చాలా శాంతంగా–



"నువ్వు నమ్మవు – మొన్న వాళ్ళిద్దర్నీ నేను కళ్ళారా చూశాను – కాలేజీ దగ్గర –"

"ఒకరోజు నేనూ చూశాను –"

"మరి నువ్వెందుకు వూరుకున్నావు?"

"ఏం చెయ్యను?"

"మళ్ళీ అదే ప్రశ్న, నేనైతే ఆ హేమని లాగి చెంప మీద కొట్టి వుందును. మొగుణ్ణి ఇంటికి లాక్కొచ్చి మొహం మీద నాలుగు కడిగేసి వుందును – నువ్వు అసమర్థురాలివో అతి తెలివి గల దానివో నాకు అర్థం కావడం లేదు–" నళిని గొంతులో కసి –

భారతి నవ్వుతోంది.

"ఇవన్నీ తాత్కాలికంగా వచ్చే గాలి దుమారాలు– అంత సీరియస్‌గా తీసుకుని బాధ పడ్డం ఎందుకు?" అన్నది.

"అంటే నీ కాపురం కూలిపోయినా నీకేం చీమ కుట్టినట్టు లేదన్న మాట!"

"ఓసి నా పిచ్చి నళినీ – ఇంతలోనే కాపురం ఎందుకు కూలుతుందే! వాళ్ళిద్దరూ లేచిపోతారని నాకేం భయం లేదు. డబ్బూ హోదా వదులుకుని ఎవరు ఈయన వెంట పడి వస్తారే? అందులో హేమేనా వచ్చేది? పరువు ప్రతిష్ట అంటూ పడిచచ్చే వంశంలో పుట్టిన మీ అన్నయ్యా వెళ్ళిపోయేది? ఇంత దూరం ఎందుకు ఆలోచిస్తావే నువ్వు!

తాత్కాలింంగా - అదో సరదా ! దానికి వాళ్ళని గోల చెయ్యడం ఏం బాగులేదు -"

రామారావు నిశ్చేష్టుడే అయిపోయాడు -

"భారతీ హేట్స్ ఆఫ్" అనుకున్నాడు -

తలుపు కొట్టాడు -

"అదేం అలా వున్నారు ?" అంటూ ఆప్యాయంగా పలకరించి తలుపు తీసింది -

"కొంచెం తలనెప్పి -" నసిగాడు.

ఆ తరువాత రోజూ ఆఫీసు వదలగానే ఇంటి కొస్తు న్నాడు రామారావు - శిరీషతో ఆడుతున్నాడు. భారతికి ఏదైనా సాయం చేస్తున్నాడు - "నళినీ నీకు పరీక్షలు దగ్గర పడ్డాయిగా- చదువుకో-" అంటున్నాడు.

ఈ మార్పుకి నళిని ఆశ్చర్యపడింది గానీ భారతి కేం విస్మయం కలుగలేదు -

మరో నెల తరువాత బ్యాంక్‌నుంచీ బయటకు వస్తూ రిక్షా కోసం నాలుగు వైపులా చూస్తోంది భారతి -

గచ్చకాయరంగు ఫియట్ కారు వస్తోంది. అటు వైపు చెయ్యి వూపి, 'హాయ్! హేమా!" అని పిలిచింది - కారు ఆగలేదు - సరి కదా వేగం పుంజుకుని దుమ్ము రేపు కుంటూ వెళ్ళిపోయింది -

"పూర్ డార్లింగ్ !" అనుకుంది భారతి.

—: o :—